నేడు ప్రజాపాలన దినోత్సవం

ముఖ్య అతిథిగా హాజరుకానున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించనున్న తెలంగాణ ప్రజాపాలన వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరవుతున్నట్లు అధికారులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. కొంగరకలాన్‌లోని కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటలకు మంత్రి జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేసే కుట్ర



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ ఎత్తివేతకు ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కదండి శ్రీరామ్ అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట విద్యార్థులు ధర్నా చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మాట్లాడుతూ పేద, బడుగు బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వాలు తీసుకొచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తేయాలని కుట్ర పన్నుతుందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా రూ.8,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థులను అరిగోస పెడుతుందని తెలిపారు. ధర్నాలో ఏబీవీపీ నాయకులు శివకృష్ణ, శ్రీకాంత్, మహేష్, చరణ్, శ్యాంకిరణ్, సూర్యప్రకాశ్, చందు, వినయ్, జగదీష్, మహిపాల్, మహేందర్, పవన్, రాజేష్, భాను, హారిక, భరత్, మధుకిరణ్ పాల్గొన్నారు.



ఫార్మాసిటీ రైతులకు నోటీసులు

రాతపూర్వకంగా సమాధానమివ్వాలంటూ ఆదేశం



కోదండరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

యాచారం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిపల్లి, తాడిపర్తి, కుర్మిద్ద, నానక్‌నగర్ గ్రామాల్లో ఫార్మాసిటీ భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు ఫార్మాసిటీ భూసేకరణ అధికారులు నోటీసులు జారీ చేశారు. రైతులు వ్యక్తిగతంగా, లేదా న్యాయవాది ద్వారా అథారిటీ వద్ద ఈనెల 19న హాజరై సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లోని 128 మంది రైతులకు సంబంధించిన 2,500 ఎకరాల పట్టా భూములను 6 నవంబరు 2020లో నిషేధిత జాబితాలో చేర్చారు. 2013 చట్టంలోని సెక్షన్ 64 కింద కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న రైతులు సోమవారం రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డితోపాటు ప్రొఫెసర్ కోదండరాంలను కలిసి తమ గోడు విన్నవించారు. తమ భూములను నిషేధిత జాబితాలో నుంచి తొలగించాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లో తమ భూములను సేకరించవద్దన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి, ఉన్నతాధికారులతో మాట్లాడి ఆదుకుంటామని కోదండరెడ్డి, కోదండరాంలు హామీ ఇచ్చినట్లు బాధిత రైతులు తెలిపారు.

మైక్రో బ్రేవరీల ఏర్పాటు వద్దు

ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శివకుమార్‌గౌడ్



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మైక్రో బ్రేవరీల(బీర్ల తయారీ యూనిట్) ఏర్పాటుకు ఎక్సైజ్‌శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌ను ప్రభుత్వం రద్దు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శివకుమార్‌గౌడ్ చేశారు. మంగళవారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ దశరథకు వినతిపత్రం అందించారు. మైక్రో బ్రేవరీలను ఏర్పాటు చేయొద్దని కోరారు. బ్రేవరీలు ఏర్పాటు చేస్తే విద్యార్థులు, యువతపై ప్రభావం పడుతుందన్నారు. మద్యం అధిక వినియోగం, హింస, అశాంతి, శాంతి భద్రతల్లో నియంత్రణ లేకపోవడం, ఆరోగ్యపరమైన సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. మైక్రో బ్రేవరీల ఏర్పాటును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, నాయకులు మధుకర్, గండికోట శివ పాల్గొన్నారు.



షాబాద్‌లో యూరియా టోకన్‌ల కోసం బారులు తీరిన రైతులు (ఫైల్)

బారులు.. బాధలు!

ఇంకా తీరని యూరియా కష్టాలు

- జిల్లాకు కావాల్సింది 72,200 మెట్రిక్ టన్నులు
- ఇప్పటివరకు వచ్చింది 23,563 మెట్రిక్ టన్నులే..
- రోజూ పీఏసీఎస్‌ల వద్ద రైతుల పడిగాపులు
- చెప్పులను క్యూలో ఉంచుతున్న వైనం
- అయినా ఒక్క బస్తా దొరక్క నిరాశలో రైతులు
- కొన్నిచోట్ల రోడ్డెక్కి ధర్నాలు, రాస్తారోకోలు

జిల్లాలో పంపిణీ చేసిన ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో)

మండలం	మొత్తం
ఆమనగల్లు	2,133.855
కడ్తాల్	686.97
మాడ్గుల	1,207.485
తలకొండపల్లి	2,065.725
చేవెళ్ల	977.04
మొయినాబాద్	421.335
షాబాద్	1,778.67
శంకర్‌పల్లి	1,494.99
అబ్దుల్లాపూర్‌మెట్	218.115
హయత్‌నగర్	130.41
ఇబ్రహీంపట్నం	861.57
మంచాల	268.83
యాచారం	449.145
బాలాపూర్	83.07
కందుకూరు	871.92
మహేశ్వరం	911.205
శంషాబాద్	534.06
చౌదరిగూడెం	1,552.455
ఫరూక్‌నగర్	1815.3
కేశంపేట్	3,200.715
కొందుర్గు	1,543.725
కొత్తూరు	515.115
నందిగామ	742.28
మొత్తం	23,563.985

యూరియా కొరత రైతులను వేధిస్తూనే ఉంది. డిమాండ్‌కు తగ్గ యూరియా రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంటలకు సకాలంలో యూరియా తప్పనిసరిగా వేయాలి. లేదంటే దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు యూరియా కోసం వ్యవసాయ కార్యాలయాలు, సొసైటీలు, ఎరువుల దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. ఈ సీజన్‌కు సంబంధించి జిల్లాకు 72,200 మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచాల్సి ఉండగా ఇప్పటివరకు 23,563 మెట్రిక్ టన్నులే సరఫరా చేయడంతో కొరత ఏర్పడుతోంది. దీంతో పలు చోట్ల రైతులు ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు.

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 3.47 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. గతేడాదితో పోలిస్తే వరి సాగు పెరగగా పత్తి గణనీయంగా తగ్గింది. గత వానాకాలంలో వరి సాగు విస్తీర్ణం 1,00,608 ఎకరాలు ఉండగా ఈ ఏడాది 1,40,238 ఎకరాల్లో సాగవుతున్నట్లు అంచనా. సన్నాలకు ప్రభుత్వం రూ.500 ప్రోత్సాహకం ఇస్తుండటంతో అంచనాలకు మించి రైతులు వరి సాగు చేస్తున్నారు. గతేడాది పత్తి

మిగతా 8వ పేజీలో...



దొరకడం లేదు

మూడెకరాల్లో వరి వేసిన. వర్షాలు పడుతున్నయ్.. యూరియా చల్లాల్సి ఉంది. మా సొసైటీకి యూరియా వస్తే మధ్యాహ్నం వరకే అయిపోయింది. గంటల తరబడి క్యూలో ఉన్నా బస్తా కూడా దొరకడం లేదు.

- గాడిచర్ల రమేష్, రైతు, ముడిమ్యాల

చిట్టీల పేరుతో మోసం

తప్పించుకుతిరుగుతున్న దంపతులు

పోలీసులను ఆశ్రయించిన బాధితులు



నిందితుడు సురేందర్ ముదిరాజ్

శంషాబాద్‌రూరల్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): చిట్టీల పేరుతో ఘరాన మోసం జరిగిన ఘటన మంగళవారం ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్‌కు చెందిన పల్లేమోని సురేందర్‌ముదిరాజ్, పల్లేమోని కవిత భార్యభర్తలు. 20 ఏళ్లుగా చిట్టీలు నడుపుతున్నారు. అయితే మధురానగర్‌కు చెందిన మంచర్ల శ్రీనివాస్ రూ.5 లక్షల చిట్టీ, ఇతడి సమీప బంధువులు రూ.2 లక్షల చిట్టీలు, కళావతి అనే మరో మహిళ రూ.3 లక్షల చిట్టీ కట్టింది. ఒక్క శ్రీనివాస్ బంధువులే రూ.18 లక్షల చిట్టీ కట్టారు. రెండు, మూడు నెలల ఆ డబ్బులు ఇవ్వాలని అడిగితే సురేందర్, ఆయన భార్య కవిత తప్పించుకొని తిరుగుతున్నారని, మంగళవారం వారి ఇంటికి వెళ్లి చూడగా తాళం వేసి ఉందని తెలిపారు. వెంటనే ఆర్జీఐఏ పోలీస్‌స్టేషనలో ఫిర్యాదు చేశారు. వీరితో పాటు మరికొంత మంది పోలీసులకు ఫిర్యాదు చేసిన్నట్లు సమాచారం. దీనిపై ఎస్సై అశోక్‌వర్మ మాట్లాడుతూ ఇప్పటివరకు 15 మంది బాధితులు వచ్చారని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

షాబాద్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, చంద్రమోహన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికుల ఐదో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వీడిన గ్రహణం

30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి మోక్షం

రూ.22.80 లక్షల నిధులు మంజూరు.. ప్రజలకు చేరువకానున్న వైద్యసేవలు



అర్ధంతరంగా ఆగిపోయిన 30 పడకల ఆసుపత్రి భవనం



శిలాఫలకం

కేశంపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కేశంపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి గ్రహణం వీడనుంది. మిగిలిపోయిన పనులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇటీవల రూ. 22.80లక్షల నిధులు మంజూరు చేయించారు. గత ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసి 30 పడకల ఆసుపత్రులుగా మార్చాలనుకుంది. అందులో భాగంగానే కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిని మంజూరు చేసింది. ఇందుకుగాను

మిగతా 8వ పేజీలో...



ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

కేశంపేట ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనుల ఆగిపోయిన విషయాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకపోవడంతో వెంటనే స్పందించారు. అధికారులతో మాట్లాడి ఎస్టిమేషన్ వేయాలని సూచించారు. వారి సూచన మేరకు రూ. 22.80లక్షలు మంజూరు చేయించారు. మండల ప్రజల తరఫున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.

- గూడ వీరేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, కేశంపేట

రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ 75వ జన్మదినం సందర్భంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా 30 ప్రాంతాల్లో హెల్త్ క్యాంపులు, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ తెలిపారు. ఒక్కో శిబిరంలో 75 మంది రక్తాన్ని ఇచ్చేందుకు ముందుకు వస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ప్రత్యేక హెల్త్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో చేపట్టే రక్తదాన శిబిరాల్లో ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజా పోరాటానికి మతరంగు పులమొద్దు

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య



సభలో మాట్లాడుతున్న పాలమాకుల జంగయ్య

కందుకూరు/షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిజాం ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా చేపట్టిన ప్రజా పోరాటానికి మత రంగు పులమొద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ మండల కార్యదర్శి రాజు అధ్యక్షతన నిర్వహించిన వార్షికోత్సవ సభలో పాల్గొని మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం చేపట్టిన ఉద్యమమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అన్నారు. హైదరాబాద్ సంస్థానం రాజు ముస్లిం అయినప్పటికీ జమీందారులు, జాగీర్‌దారులు, భూస్వాములు 90 శాతం మంది హిందువులే నిజాంకు గులాములుగా వ్యవహరించారని ఆరోపించారు. నిజాంకు వ్యతిరేకంగా పోరాటం చేసిన దానిని నేడు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు మత ఉన్మాదంగా, మతోన్మాదంగా హిందూ, ముస్లిం చరిత్రను వక్రీకరిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.పర్వతాలు, బి.దత్తునాయక్, పి.యాదయ్య, పి.దేవేందర్‌గౌడ్, బ్రహ్మచారి, రవి, అంజి, శివ, రాకేష్, రమేష్, సుగుణమ్మ, దేవమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు. అలాగే షాద్‌నగర్ పెన్షనర్ భవన్‌లో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీను అధ్యక్షతన జరిగిన సభకు జంగయ్య హాజరై మాట్లాడారు. సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో భవిష్యత్ ఉద్యమాలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

వైభవంగా పల్లకీ సేవ



తలకొండపల్లి: స్వామివారి పల్లకీ సేవ

మొయినాబాద్ రూరల్/తలకొండపల్లి, సెప్టెంబరు 16(ఆంధ్యజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చిలుకూరు బాలాజీ ఆలయంలో, తలకొండపల్లి మండల పరిధిలోని దేవుని పడకల్ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉట్ల పండుగ నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని పల్లకీలో పురవీధుల గుండా ఊరేగించారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ మాట్లాడుతూ ఉట్ల పండుగ అంటే కేవలం హండీ పగలగొట్టడం కాదని, అది వర్ణ, కుల తరగతుల మధ్య ఉన్న తారతమ్యతలను తొలగించడమని పేర్కొన్నారు.



మొయినాబాద్ రూరల్: చిలుకూరు ఆలయం వద్ద స్వామివారి పల్లకీ సేవ

హైటెన్షన్ లైన్ అలైన్మెంట్‌ను వ్యతిరేకించా.. 7
ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

గ్రామాల అభివృద్ధే లక్ష్యం 8
చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య




















ఊరేగింపులో ఎమ్మెల్యే శంకర్, భక్తులు

ఘనంగా మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు

కొత్తూర్, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): ఇన్ముల్‌నర్వలోని హజ్రత్ జహంగీర్ పీర్ దర్గా వద్ద మిలాద్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇన్ముల్‌నర్వ ఏక్ మినార్ నుంచి దర్గా వరకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, వేలాది మంది ముస్లింలు ఊరేగింపుగా బయల్దేరారు. దర్గాకు చేరుకుని ప్రార్థనలు నిర్వహించి పాతియాల్ సమర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అలీఖాన్‌బాబర్, డైరెక్టర్ రవినాయక్, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, ఖాజాపాషా, ఎ.రవికుమార్, తిరుపతిరెడ్డి, జె.నర్సింహ, సాదిక్, ఇబ్రహీం, శంకర్‌నాయక్, హబీబ్ పాల్గొన్నారు.

పాఠశాలకు దాతల సహకారం గొప్పది

చేవెళ్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలకు దాతల సహకారం చాలా గొప్పదని పర్యావరణ అవార్డీ, సామాజికవేత్త రామకృష్ణారావు అన్నారు. మంగళవారం చేవెళ్లకు చెందిన రియలెస్టేట్ వ్యాపారి జూకన్నగారి జైపాల్‌రెడ్డి తనకుమారుడు గీత్ శ్రీనందన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని బాలికల పాఠశాలకు బీరువాలు, ఇతర సామగ్రి అందజేశారు.

మేకల దొంగలకు రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ

రూ.2.62లక్షల నగదు, నాలుగు కార్ల స్వాధీనం

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పగలంతా కార్లలో తిరుగుతూ రెక్కీ నిర్వహించి రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో మేకలు, గొర్రెల అపహరణకు పాల్పడుతున్న ఏడుగురు దొంగల ముఠాను సోమవారం రాత్రి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఏసీపీ లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం విలేకరులకు వివరాలను వెల్లడించారు. హైదరాబాద్‌లోని పహాడీ షరీఫ్‌కు చెందిన మహ్మద్ ఫిరోజ్(24),అబ్దుల్‌కలీం(25), మహ్మద్ సొహైల్(24), షేక్ రవూఫ్(23), మహ్మద్ జమీర్(26), ఆరిఫ్(25), షేక్ హసీనుద్దీన్(22),కోయల్కర్ సాయికిరణ్(30)లు ముఠాగా ఏర్పడ్డారన్నారు. వీరు కార్లలో తిరుగుతూ ఎక్కడెక్కడ మేకలు, గొర్రెలమందలు పెడతారో రెక్కీ నిర్వహించి రాత్రిళ్లు డీసీఎంలో వాటిని తరలిస్తున్నారని తెలిపారు. మేకలు, గొర్లను జియాగూడ మార్కెట్‌లో విక్రయించి వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తారని చెప్పారు. చించోడులో 28, వెలిజర్లలో8, చౌదరిగూడలో 8, పెద్ద ఎల్కిచర్లలో 23, తంగెళ్ల పల్లిలో 8, వెంకిర్యాలలో 9, పరిగి మండలం కోటివాడలో 12, సుల్తాన్‌పూర్‌లో 30, దోమ మండలం ఉదంతారావుపల్లిలో 15, జధిరసంపల్లిలో ఆరు జీవాలను అపహరించారని తెలిపారు. జియాగూడలో మేకలను విక్రయిస్తుండగా వాటి యజమాని ప్రవీణ్ గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడన్నారు. దీంతో తాము దొరికిన వారిని విచారించగా మొత్తం వ్యవహారం బయటపడిందన్నారు. ఈ నెల 14న షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధి సోలీపూర్‌లో మేకల దొంగలను పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులనుంచి రూ.2.6లక్షలు, నాలుగు డీసీఎంలు, నాలుగు కార్లు, ఏడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

సిద్దన్నమడుగు తండాలో చిరుత?

- ఆందోళనలో తండావాసులు



తండా సమీపంలోని పొలాల్లో చిరుత పులి కాలిగుర్తులు

కాలు గుర్తులను కొలతలు వేసి పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారి

పెద్దేముల్/తాండూరు రూరల్: సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సిద్దన్నమడుగుతండా వ్యవసాయ పొలాల్లో చిరుత సంచరించినట్లుగా ఆనవాళ్లు బయటపడ్డాయి. అదిచూసిన రైతులు వెంటనే ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. మండలంలోని తట్టెపల్లి అటవీ ప్రాంతంలోని సిద్దన్నమడుగుతండా వ్యవసాయ పొలాల్లో మంగళవారం ఉదయం రైతులకు పెద్దపెద్ద పాదముద్రలు కనిపించాయి. అవి చిరుత కాలిగుర్తులే అయ్యుంటాయని అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు అక్కడికి చేరుకుని పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వ్యవసాయపొలంలో కనిపించిన కాలిగుర్తులను కొలతలు వేసి పరీక్షించారు. పాదముద్రలు చిరుతవి అయ్యుంటాయనే అనుమానాలు వ్యక్తం చేశారు. అయితే పూర్తిగా అవి చిరుతవే అని చెప్పలేమని, ల్యాబ్‌కు పంపించి పూర్తినిర్ధారణ చేసుకుంటామని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీదేవి సరస్వతి పేర్కొన్నారు. ఉద్దండాపూర్, గుండ్ల మడుగుతండా, మైసమ్మగడ్డతండా తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాండూరు ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీదేవిసరస్వతి పేర్కొన్నారు. అయినప్పటికీ పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరికి ఎలాంటి ఆధారాలు లభించినా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో స్వప్న, ఎఫ్‌బీవో నాగసాయి పాల్గొన్నారు.

మంగల్‌పల్లి ప్యాక్స్ చైర్మన్‌గా శ్రీశైలం



ఆదిభట్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మంగల్‌పల్లి సొసైటీ చైర్మన్‌గా ఆదిభట్ల డైరెక్టర్ జమ్మ శ్రీశైలాన్ని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పాత చైర్మన్ మంచిరెడ్డి మహేందర్‌రెడ్డి పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక జీవోతో డైరెక్టర్లలో ఒకరిని చైర్మన్‌గా నియమించింది. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ తనకు చైర్మన్ పదవి వచ్చేలా చూసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏఎంసీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఈసీ శేఖర్‌గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రకృతిని కాపాడుదాం

ఆదిభట్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మానవ మనుగడకు ప్రకృతి సంపదను కాపాడుకోవాలని సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆదిభట్ల పరిధి కొంగరకలాన్ పాఠశాలల్లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ సంస్థ, విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించిన 'యంగ్ ఎర్త్ లీడర్స్' ప్రోగ్రాంలో ఆయన పాల్గొన్నారు. మొక్కల పెంపకం, ఇంకుడు గుంతలు, కంపోస్ట్ పిట్ వంటి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేశ్వర్‌రెడ్డి, సునీత, సమత, రామచంద్రయ్య, యాదయ్య, శ్రీవేణి, భాస్కర్, పాండు, నిహారిక, నిఖిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేయాలి



చెక్కులు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి):ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలిశ్రీనివాస్ రెడ్డి కోరారు. ముఖ్యమంత్రి సహాయ నిధి స్కీం పేదలకు వరంలా నిలుస్తోందన్నారు.ఆమనగల్లు, మాడ్గుల, వెల్దండ మండలాల లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో యాదయ్య, బాబర్, మొయినుద్దీన్, నబీ, నాగులు, భీమయ్య, నిరంజన్, నర్సింహ, మధుసూదన్‌రెడ్డి, జోగయ్య, ఆనంద్, శ్రీనివాస్, రవి, రమేశ్, శ్రీను, చంద్రశేఖర్‌రెడ్డి, సుభాష్, సుమన్ పాల్గొన్నారు.

7వ రోజుకు చేరిన రుణమాఫీ దీక్షలు



రిలే దీక్షలో రైతులు, నాయకులు

ఘట్‌కేసర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ సహకార సంఘంలో రుణాలు తీసుకున్న అర్హులైన రైతులందరికీ తక్షణమే రుణమాఫీ చేయాలని చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం 7వ రోజుకు చేరుకున్నాయి. ఘట్‌కేసర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులు మద్దతు ప్రకటించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నానో యూరియాపై అవగాహన కల్పించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయఅధికారి రాజారత్నం,

మోమిన్‌పేట్, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ జిల్లా అధికారి రాజారత్నం అన్నారు. మోమిన్‌పేట్, మేకవనంపల్లి సొసైటీల్లో మంగళవారం మండల వ్యవసాయ అధికారి జయశంకర్‌తో కలిసి యూరియా నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. తక్కువ ధరకు లభించే నానో యూరియా వాడకంతో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు చంద్రిక, సీఈవో జహంగీర్, సిబ్బంది బాలకృష్ణ, యాదయ్య, డైరెక్టర్‌లు, రైతులు గోవర్ధన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మహబూబ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

పదవులు లేకున్నా ప్రజల్లోనే ఉంటా



ఆర్థిక సాయం అందజేస్తున్న సత్యం

ఆమనగల్లు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పదవులు ఉన్నా, లేకున్నా తాను నిరంతరం ప్రజల మధ్యే ఉంటానని జిల్లా కాంగ్రెస్ నాయకుడు ఎగిరిశెట్టి సత్యం, మాజీ సర్పంచ్ గోదాదేవిలు అన్నారు. శెట్టిపల్లిలో మంగళవారం సత్యం, గోదాదేవిలు పర్యటించి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు. అనారోగ్యంతో మృతిచెందిన మల్లమ్మ కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు. దసరా నేపథ్యంలో సొంత డబ్బులు రూ.3లక్షలతో రోడ్ల మరమ్మతులు చేయిస్తున్నట్టు తెలిపారు.


బాలాజీసింగ్‌కు ఎంపీ పరామర్శ



రతన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధికార ప్రతినిధి, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ బాలాజీ సింగ్ తండ్రి రతన్ సింగ్‌ఠాకూర్ మృతి పట్ల నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేలు నారాయణరెడ్డి, రాజేశ్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డిలు సంతాపం తెలిపారు. మంగళవారం కల్వకుర్తిలోని ఆయన నివాసంలో రతన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించి బాలాజీసింగ్‌ను పరామర్శించారు. టీచర్‌గా రతన్‌సింగ్ అందించిన సేవలను కొనియాడారు. నాయకులు మధుసూదన్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, గుర్రం కేశవులు, సంజీవ్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

చరిత్ర మరువని రోజు సెప్టెంబరు 17



తెలంగాణ చరిత్ర మరువని రోజు 1948 సెప్టెంబరు 17. అది నిజాం నిరంకుశత్వం తలవంచిన రోజు. రజాకార్ల ఆగడాలు అంతమైన రోజు. నాటి రెండు కోట్ల మంది తెలంగాణ ప్రజల హృదయాల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడిన పర్వదినం. ఈ నేలపై త్రివర్ణపతాకం ఎగిరిన రోజు. నిజాం రాచరిక పాలన ముగిసి, హైదరాబాద్ రాజ్యం భారత ప్రభుత్వంలో కలిసిన ఆ రోజు వెనుక అనేక ఘటనలు ఉన్నాయి. అందులో కొన్ని అంశాలు, ప్రముఖుల అభిప్రాయాలతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

- హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి)


తెలంగాణ చరిత్రలోనే మరచిపోలేనిది 1948 సెప్టెంబరు 17 ఘట్టం. ఈ ఘట్టంలో ప్రతినాయకుడు ఖాసీం రజ్వీ 'మజ్లిస్ ఎ ఇత్తేహాద్ ఉల్ ముస్లిమీన్' సంస్థకు నాయకుడు. ఆయన స్వస్థలం మరత్వాడాలోని ఉస్మానాబాద్ జిల్లా లాతూర్. అలీగఢ్‌లో న్యాయశాస్త్రం అభ్యసించిన అనంతరం హైదరాబాద్‌లో కొంతకాలం వకీలు మహమ్మద్ అలీ ఫాజిల్ దగ్గర సహాయకుడిగా పనిచేశాడు. తర్వాత సొంతూరుకు వెళ్లిన అతను మజ్లిస్ స్థానిక నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందాడు. యావదాస్తిని ఆ సంస్థకు రాసిచ్చి నాయకుల మనసులో ప్రత్యేక స్థానం సంపాదించాడు. కొద్దిరోజులకే సంస్థ పగ్గాలు చేపట్టాడు. సమయస్ఫూర్తి, వాగ్ధాటితో సామాన్యులను ఆకట్టుకున్న రజ్వీ నిజాం ప్రభుత్వాన్ని శాసించే స్థాయికి ఎదిగాడు. రజాకార్ ఉద్యమానికి నాయకత్వం వహించి, పలు హింసాత్మక ఘటనలకు కారకుడయ్యాడు. హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనం (పోలీసు చర్య) అనంతరం రజ్వీని భారత సైన్యం అరెస్టుచేసి తిరుమలగిరి సైనిక కారాగారంలో నిర్బంధించింది. 1957, సెప్టెంబరు11న విడుదలైన రజ్వీ అదే నెల18న నగరం నుంచి ముంబైకు, అక్కడి నుంచి పాకిస్థాన్‌కు వెళ్లిపోయాడు. కరాచీలో న్యాయవాదిగా ప్రాక్టీసు మొదలుపెట్టాడు. ఒకనాడు ఈ నేలను శాసించాలనుకున్న రజ్వీ 1970, జనవరి 15న ఓ సాధారణ వ్యక్తిగా కన్నుమూశాడు. .

భయంతో ఆస్తులమ్మారు



పోలీసు యాక్షన్‌కు వారం ముందు 'బక్రీదుకు గొర్రెలను కాదు, హిందువుల తలలు నరుకుతాం. వాళ్ల రక్తంతో హోలీ ఆడతాం' అని రజాకార్ నాయకుడు ఖాసీం రజ్వీ ప్రకటించినట్లుగా నగరమంతా వదంతులు వ్యాపించాయి. దాంతో హిందువులంతా భయంతో ఆస్తిపాస్తులు అమ్ముకొని బతికినన్నాళ్లు అయినా ఆనందంగా జీవించాలని విందులు చేసుకున్నారు. అదే సమయంలో భారత సైన్యం ప్రవేశించడంతో నిజాం లొంగిపోయాడని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. యుద్ధ ట్యాంకులు, వాహనాలకు పూలమాలలు వేసి, భారత జవానులకు లడ్డూలు తినిపిస్తూ సంబురాలు చేసుకున్నారు. ముస్లింలంతా రజాకార్లు కాదు. ఆ సమయంలో రజాకార్ల దాడినుంచి ఎంతోమంది హిందువులను ముస్లింలు కాపాడారు. ఈ విషయాలన్నీ ప్రత్యక్ష సాక్షి మా అక్కచెప్పగా నాకు తెలిశాయి.

- పరవస్తు లోకేశ్వర్, నగర చరిత్ర పరిశోధకుడు



నిజాం ప్రధానిమీదా రజాకార్ల దాడి

నిజాం నిరంకుశ పాలనలో సామాన్యుల మానప్రాణాలను హరించిన రజాకార్లు నిజాం ప్రధాని మీదా దాడి చేయడం కొంత మందికే తెలుసు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని ఓ ఆస్పత్రి ఆవరణలో తలెత్తిన ఘర్షణలో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించాలన్న కాంక్షతో కొంత మంది రజాకార్లు ఆనాటి ప్రధాని అధికారిక నివాసం షా మంజిల్(ప్రస్తుతం రాజ్‌భవన్)ను ముట్టడించారు. లోపల గృహోపకరణాలకు నిప్పుపెట్టారు. అంతటితో ఆగక ప్రధానమంత్రిపై సైతం దాడికి పాల్పడ్డారని మందుముల నరసింహారావు జ్ఞాపకాల్లో ప్రస్తావించారు.

దక్కన్ రేడియోలో స్వాతంత్ర్య ప్రకటన

భారత ఆర్మీ 1948, సెప్టెంబరు18న నగరానికి చేరింది. అంతకు ఒకరోజు ముందు రోజు సెప్టెంబర్17న ఖాసీం రజ్వీ హైదరాబాద్‌లో నరమేధానికి వ్యూహం పన్నాడు. ఈ విషయం తెలిసి ఉస్మానాబాద్ కలెక్టర్ మొహమ్మద్ హైదర్ ఆనాటి నిజాం పోలీసు ఉన్నతాధికారి నవాజ్ దీన్‌యార్‌జంగ్ దగ్గరకు పరుగుతీశాడు. ఇరువురు ఫోన్‌ద్వారా రజ్వీకి నచ్చజెప్పి కల్లోలాన్ని ఆపించారు. ఈ విషయాన్ని మొహమ్మద్ హైదర్ జ్ఞాపకాల్లో రాశారు. అంతకు ముందురోజే సైన్యాధ్యక్షుడు ఎల్.ఇద్రూస్ నిజాంను కలిసి సైన్యాన్ని ప్రతిఘటించడం వల్ల మరింత ప్రాణ నష్టం మినహా మరేమీ లేదని విన్నవించాడు. దీంతో సెప్టెంబరు17న మొదట ఖాసీం రజ్వీ ఖైరతాబాద్‌లోని దక్కన్ రేడియో ద్వారా తన ఓటమిని అంగీకరించాడు. ఆ తర్వాత కేఎంమున్షీతో కలిసి దక్కన్ రేడియోకు చేరుకున్న నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్... భారత సైన్యాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో కొన్ని వందల ఏళ్ల రాచరిక పాలన నుంచి ఈ నేలకు స్వాతంత్ర్యం సిద్ధించింది. ప్రజలంతా ఆనందోత్సాహాలతో సంబురాలు చేసుకున్నారు. నగర వీధుల్లో జాతీయ జెండా ఎగరేశారు.



రావిర్యాల చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

బతుకమ్మ పండుగ విశిష్టతను చాటిన కేసీఆర్

మహేశ్వరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టే బోనాలు, బతుకమ్మ పండుగల వైశిష్ట్యాన్ని ప్రపంచానికి చాటిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. మంగళవారం తుక్కుగూడ, రావిర్యాల, మంకాల్ చెరువుల వద్ద బతుకమ్మ ఘాట్లను ఆమె పరిశీలించారు. బతుకమ్మల నిమజ్జనానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఘాట్లను ఏర్పాటు చేసిందన్నారు. అలాగే మహేశ్వరం మోడల్ స్కూల్లో స్కావెంజర్ల జీతాల్లో స్కాం జరిగిందని వార్తలొస్తున్నాయి, దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మహేశ్వరం మోడల్ స్కూల్ జిల్లాలో ఆదర్శవంగా ఉండేదన్నారు. కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ భ్రష్టు పట్టిందన్నారు. కార్యక్రమంలో నాయకులు జెల్లల లక్ష్మయ్య, సామెల్‌రాజు, రవినాయక్, సుమన్, మున్సిపల్ కమిషనర్ వాణి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి 'అవేర్' కృషి



మాధవన్‌జీని సన్మానిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కందుకూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి ఆవేర్ సంస్థ నిరంతరం కృషి చేస్తోందని సంస్థ చైర్మన్ మాధవన్‌జీ అన్నారు. మంగళవారం సరస్వతిగూడ వైద్యశిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 30ఏళ్ల క్రితం స్థాపించిన అవేర్ సంస్థ ఆధ్వర్యంలో హాస్పిటళ్లను నిర్మించి గ్రామీణులకు ఉచిత వైద్యశిబిరాలతో పాటు వాటర్‌షెడ్ల ద్వారా వ్యవసాయ రంగానికి సేవలందిస్తున్నట్టు తెలిపారు. గ్రామస్తుల కోరిక మేరకు సరస్వతిగూడలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, ఆలయ నిర్మాణానికి సహకారమందిస్తానన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు కె.విష్ణువర్ధన్‌రెడ్డి, కె.ప్రశాంత్‌కుమార్, నాయకులు బి.యాదయ్య, జి.నర్సింహ, జి.సత్యనారాయణరెడ్డి, కె.రాజిరెడ్డి, కె.శ్రీనివాస్, వెంకన్న, ఎ.మహేందర్, కె.పాండురంగారెడ్డి, బి.మమాదగిరి, మల్లేశ్, యాదయ్య, శ్రీనివాస్, రవీందర్, దేవేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆంగ్లంలోనే బోధించాలి

చౌదరిగూడ, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలోనే బోధన చేయాలని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ లింగయ్యగౌడ్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం జిల్లేడ్ చౌదరిగూడ హైస్కూల్, లాల్‌పహాడ్‌లోని కస్తూర్బా పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బోధన తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్లాస్ రూంలో బోధన తీరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు ఆంగ్ల మాధ్యమంలోనే సులువైన భాషలో బోధించాలని టీచర్లకు సూచించారు. బాలికలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం, విద్యను అందించాలని తెలిపారు. ఆయన వెంట ఎంఈవో కిరణ్‌కుమార్‌రెడ్డి, జీహెచ్ఎం సునీత, కేజీబీవీ ఎస్వో రాగసుధ ఉన్నారు.

దొంగ జీవోలతో చైర్మన్లను తొలగిస్తున్న ప్రభుత్వం

మహేశ్వరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల చైర్మన్లను ప్రభుత్వం అడ్డగోలు దొంగ జీవోలతో పదవుల నుంచి తొలగిస్తోందని మహేశ్వరం ప్యాక్స్ మాజీ చైర్మన్ మంచె పాండుయాదవ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకుంటున్న కాంగ్రెస్‌కు త్వరలో ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. మహేశ్వరం ప్యాక్స్ చైర్మన్‌గా ఉన్న తనకు తెలియకుండా అర్ధరాత్రి జీవోలు తెచ్చి పదవి నుంచి తప్పించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ధైర్యం ఉంటే అన్ని వర్గాలకు ఎన్నికలు పెట్టాలని సవాల్ విసిరారు. ఎన్నికల్లో ఓడిపోతామే కాంగ్రెస్ నాయకులు దొడ్డిచాటున పదవుల్లో కూర్చుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో డి.వెంకటేశ్వర్‌రెడ్డి, పి.బాలయ్య, కె.ప్రభాకర్, ఎంఏ.సమీర్ పాల్గొన్నారు.

నాలాల ధ్వంసంపై హైడ్రాకు ఫిర్యాదు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా నాలాలను ధ్వంసం చేసి తమ చెరువుల్లో నీరు రాకుండా చేస్తున్నారని మంగళవారం అంకుశాపూర్‌కు చెందిన బద్దం వేణుగోపాల్‌రెడ్డి హైడ్రా కమిషనర్‌తో పాటు నీటిపారుదలశాఖ ఎస్ఈకి ఫిర్యాదు చేశారు. అంకుశాపూర్ రెవెన్యూ పరిధి సర్వేనంబర్లు 258, 259, 161, 261, 271, 263, 264, 265, 267, 268, అవుశాపూర్ సర్వేనంబర్లు 269, 274లలో పార్చ్యున్ కీర్తి రియల్‌వ్యాపార సంస్థ 38ఎకరాల్లో వెంచర్ చేస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి నాలాలను కబ్జా నుంచి విడిపించి చెరువులోకి నీరు సజావుగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

» పులుమద్ది, లింగంపల్లిలో యూపీ బృందం



పులుమద్ది గ్రామంలో ఉత్తరప్రదేశ్ బృందం

వికారాబాద్/నవాబుపేట, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ మండల పరిధిలోని పులుమద్ది, నవాబుపేట మండలంలోని లింగంపల్లి గ్రామాల్లో ఉత్తరప్రదేశ్ పంచాయతీరాజ్ అధికారులు, ప్రజాప్రతినిధులు కన్సల్టెంట్ల 33 మంది బృందం సోమవారం పర్యటించారు. పులుమద్ది గ్రామాన్ని సందర్శించి స్థానిక అభివృద్ధిపై ఎంపీడీవో వినయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పీపీవీ, టీజీకేపీ, సోక్ పిట్స్, వ్యర్థాల వర్గీకరణ షెడ్, ఆదాయ - వ్యయాలు, శానిటేషన్, రహదారులు వంటి అంశాలను పరిశీలించారు. వారు మొదటగా పల్లె ప్రకృతి వనం, కంపోస్ట్ యార్డు పరిశీలించారు. అలాగే లింగంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ నవాబుపేట మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. పులుమద్ది కార్యక్రమంలో టీజీఐఆర్డీ సెంటర్ హెడ్ అనిల్ కుమార్, ఎంపీవో దయానంద్, ఏపీఓ శ్రీనివాస్, అలాగే లింగంపల్లి గ్రామంలో ఎంపీడీవో అనురాధ, ఎంపీవో విజయ్‌కుమార్, ఏపీవో లక్ష్మీదేవి, వ్యవసాయ అధికారి జ్యోతి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రైతుల గోస పట్టించుకోని పాలకులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

తలకొండపలి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు గోస ఎల్లదీస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జి.జైపాల్‌యాదవ్ ఆరోపించారు. గట్టిప్పలపల్లి సొసైటీ గోదాం వద్ద మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జైపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేల రూపాయలు పెట్టుబడులుపెట్టి సాగుచేసిన పంటలకు యూరియా దొరక్క రైతులు దుకాణాలు, పీఏసీఎస్ కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పద్మనర్సింహ, నాయకులు, రైతులు చంద్రశేఖర్‌రెడ్డి, జయమ్మవెంకటయ్య, శిరీషకృష్ణయ్య, రాజు, జంగయ్య, శరత్‌చంద్రశర్మ, కృష్ణయ్య, అశోక్‌గౌడ్, శరత్, ఆంజనేయులుగౌడ్, రాజు, రవీందర్, కొండల్, మల్లేశ్, చంద్రశేఖర్, రత్నయ్య, పర్వతరెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్నారు.

సీజ్ చేసినా దర్జాగా నిర్మాణం

» తూంకుంటలో అక్రమంగా కన్వెన్షన్ హాల్

» మరోసారి సీజ్‌చేసిన మున్సిపల్ అధికారులు



హెచ్చరిక బోర్డును పెట్టిన మున్సిపల్ టీపీవో శ్రీధర్, సిబ్బంది

శామీర్‌పేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తూంకుంటలోని సర్వే నంబర్-334లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా భారీ కన్వెన్షన్‌హాల్‌ను నిర్మిస్తున్నారు. దీనిపై స్థానికులు ఇదివరకే మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా సీజ్ చేశారు. అయినప్పటికీ కన్వెన్షన్ హాల్ నిర్మాణ పనులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. భారీ షెడ్డు పనులను మంగళవారం చేపట్టారు. దీంతో స్థానికులు మున్సిపల్ అధికారులకు మళ్లీ ఫిర్యాదు చేశారు. ఈ విషయమై మంగళవారం తూంకుంట మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీధర్, సిబ్బంది స్పందించి పూర్వాపరాలను పరిశీలించారు. రెండో సారి సీజ్ చేసి, హెచ్చరిక బోర్డును పెట్టారు. ఈ విషయంపై టీపీవో శ్రీధర్ మాట్లాడుతూ ఒకసారి సీజ్ చేసిన తర్వాత మళ్లీ నిర్మాణం పనులు చేపడితే క్రిమినల్ కేసులు నమోదవుతాయని హెచ్చరించారు.

దేవుళ్ల పేరుతో వసూళ్లు

» నలుగురు నిందితుల అరెస్ట్

శామీర్‌పేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : దేవుళ్ల పేరుతో బలవంతంగా వసూళ్లు చేస్తున్న నలుగురు వ్యక్తులను శామీర్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన మంగళవారం తూంకుంటలో జరిగింది. తూంకుంటలోని శశిసాయి నారాయణ, చంద్రారెడ్డి కాలనీల్లో మంగళవారం మధ్యాహ్నం నలుగురు యువకులు పలువురి ఇళ్లలోకి వెళ్లి చేయికి రంగు దారం కట్టి పుస్తకంలో పేర్లు రాసుకుంటున్నారు. తాము దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నామని చెబుతూ రూ.20వేలు చందాఇవ్వాలని పలువురిని డిమాండ్ చేశారు. తమ వద్ద లేవని చెప్పినప్పటికీ దారం కట్టిన వారు కచ్చితంగా ఇవ్వాల్సిందేనని చెప్పారు. మిమ్మల్ని వదలమంటూ బెదిరిస్తూ ఫోన్‌పే ద్వారా ఒకరి నుంచి రూ.500, మరొకరి నుంచి రూ.2వేలు పంపించుకున్నారు. విషయం తెలుసుకున్న శామీర్‌పేట పోలీసులు విచారణ చేపట్టగా యాదాద్రి జిల్లా పరిధిలోని బీబీనగర్ ప్రాంతానికి చెందిన యువకులు నాగరాజు, శ్రీనాథ్, లక్ష్మణ్, రాజు అని తేలింది. కాగా పోలీసులు ఆ నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి 4 సెల్ ఫోన్లు, రెండు బైకులు, దారం ఉండలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును శామీర్‌పేట సీఐ శ్రీనాథ్ దర్యాప్తు చేస్తున్నారు.

హైటెన్షన్ లైన్ అలైన్మెంట్‌ను గతంలోనే వ్యతిరేకించా

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఎమ్మెల్యే నారాయణరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు, రైతులు

కడ్తాల్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): కడ్తాలలో రైతుల పొలాల మీదుగా 765హైటెన్షన్ లైన్ ఏర్పాటును 2023లోనే తాను వ్యతిరేకించానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. హైటెన్షన్ లైన్‌తో రైతులకు నష్టం కలగకుండా తాను కృషిచేస్తానని హామీ ఇచ్చారు. మంగళవారం రైతులు హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను కలిసి పంట భూములు పోకుండా చూడాలని వినతిపత్రం అందజేశారు. కొందరు పారిశ్రామికవేత్తల ఒత్తిడితో అలైన్మెంట్ మార్చారని విచారం వ్యక్తం చేశారు. బీదర్-మహేశ్వరం హైటెన్షన్ లైన్ పనులను నిలిపివేయించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. రైతుల విన్నపాన్ని ప్రభుత్వం, కలెక్టర్‌కు దృష్టికి తీసుకుపోతానని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ మెంబర్ శ్రీనివాస్‌గౌడ్, వేణుగోపాల్, హన్మనాయక్, కడారి రామకృష్ణ, జంగారెడ్డి, చేగూరి వెంకటేశ్, బిచ్యానాయక్, పిప్పల్ల వెంకటేశ్, పెంటారెడ్డి, శ్రీరాములు, రాములు, అభినవ్‌రెడ్డి, పర్వతకుమార్, శివరామకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి సాహసోపేత నిర్ణయాలు

ఆమనగల్లు: రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల లబ్ధిదారులకు హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, జగన్, రమేశ్‌గౌడ్, జంగారెడ్డి, రమేశ్‌నాయక్, సురేందర్‌రెడ్డి, విజయ్‌రాథోడ్ ఉన్నారు.



వినాయక చౌరస్తాలో మట్టిని తొలగిస్తున్న దృశ్యం

కొడంగల్ అభివృద్ధిలో ముందడుగు

» కోస్గి-మహబూబ్‌నగర్ హైవే పనులు ముమ్మరం

కొడంగల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ పట్టణంలో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మహబూబ్‌నగర్ నుంచి కొడంగల్ మీదుగా చించోలి హైవే రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కొడంగల్‌లో రోడ్డుకు ఇరువైపులా అడ్డుగా ఉన్న నిర్మాణాలను అధికారులు తొలగిస్తున్నారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి గాంధీనగర్ వరకు రోడ్డు విస్తరణ కోసం పనులను వేగవంతం చేశారు. ఇరుకుగా ఉన్న వినాయక చౌరస్తాలో రోడ్డుకిరువైపులా ఉన్న పురాతన భవనాలను సైతం తొలగిస్తున్నారు. కొడంగల్ అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని అధికారులు కోరుతున్నారు.



తుక్కుగూడలో 2కే రన్‌లో పాల్గొన్న కేఎల్లార్

ప్రతీ ఒక్కరు వ్యాయామాన్ని అలవర్చుకోవాలి

మహేశ్వరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రోజూ ఉదయం నడకను, పలురకాల వ్యాయామం చేస్తే నిండు నూరేళ్లు ఆరోగ్యంగా జీవించే వీలుంటుందని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం తుక్కుగూడలో నాయకులు, కార్యకర్తలతో కలిసి 2కే రన్ నిర్వహించారు. కేఎల్లార్ మాట్లాడుతూ.. జపానీలు వందేళ్లు ఆరోగ్యంగా ఉంటున్నారంటే వారు వ్యాయామాలు చేయడమేనన్నారు. ఉరుకులు పరుగుల జీవితాలతో చిన్నారులు సైతం వ్యాధుల బారినపడుతున్నారని అన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా రోజూ కొంతసేపు వ్యాయాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, యాదయ్య, అల్లె కుమార్, రాజునాయక్ పాల్గొన్నారు.

క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి



ఎస్‌జీఎఫ్ క్రికెట్ ఎంపిక పోటీల్లో క్రీడాకారులు

శామీర్‌పేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని మేడ్చల్ జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి అన్నారు. బొమ్మరాశిపేట పరిధిలోని శాంతినికేతన్ విద్యాలయ ఉన్నత పాఠశాల గ్రౌండ్స్‌లో మంగళవారం 69వ ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జోనల్ క్రీడల కార్యదర్శి గుర్రం సత్తిరెడ్డి, దీపక్ రతన్, మదన్‌మోహన్‌రెడ్డి, నరేష్, రాజశేఖర్, నరేష్, దుర్గ పాల్గొన్నారు.

గంగమ్మకు పూజలు

శామీర్‌పేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురసిన భారీ వర్షాలకు శామీర్‌పేట పెద్ద చెరువు వరద నీటితో కళకళలాడుతోంది. ఈ సందర్భంగా మంగళవారం అలియాబాద్ మాజీ సర్పంచ్ గుర్కుకుమార్ ఆధ్వర్యంలో గ్రామ నాయకులు, రైతులు చెరువు అలుగు వద్ద గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు అలాయాబాద్ గ్రామం నుంచి భారీ ఊరేగింపు నిర్వహించారు.

CHANGE OF NAME

★ జి. రవి తండ్రి గోపాల్, వయస్సు 49 సం॥ నివాసం: ఇ.నం. 4-59/22/102, గోగ్రీన్ ఆర్చిడ్ అపార్ట్‌మెంట్, తూంకుంట, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా. నా కుమారుడి బర్త్ సర్టిఫికెట్‌లో నా పేరు జి.రవిఆంథోని గా నమోదైనది. ఇకమీదట అన్ని ప్రయోజనాల నిమిత్తం నా పేరు గోపాల్‌రవి గా మార్చడమైనది. ఎవరికైనా అభ్యంతరం ఉన్నచో ఫోన్ నం.9848049212 కు తెలియజేయండి.

AJH-198714

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి



శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు మన్సూర్ అలీ

వయోజనులకు విద్య నేర్పించాలి

కేశంపేట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): 15ఏళ్ల పైబడిన నిరక్షరాస్యులకు చదవడం, రాయడం నేర్పించాలని, అలాగే డ్రాప్ అవుట్ స్టూడెంట్స్‌ను తిరిగి స్కూల్స్, కాలేజీల్లో చేర్పించేలా వలంటీర్లు కృషి చేయాలని కేశంపేట ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం మహిళా సమాఖ్య భవనంలో 'ఉల్లాస్'(అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆన్ ఇన్ ది సొసైటీ) పథకంపై వంటీర్లకు శిక్షణ నిర్వహించారు. యాప్‌లో వయోజనుల వివరాలు ఆప్‌లోడ్ చేసి చదవడం, రాయడంపై మన్సూర్ అలీ శిక్షణ ఇచ్చారు. ఏపీఎం కవిత, సీఆర్పీలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

చేవెళ్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. మంగళవారం ముడిమ్యాల్, కుమ్మెర, గొల్లపల్లి, ధర్మసాగర్, గుండాల, లక్ష్మీగూడ, సాయిరెడ్డిగూడ, అల్లావాడ, చన్వల్లి, రావులపల్లి గ్రామాల్లో హెచ్ఎండీఏ నిధులు రూ.2.3కోట్లతో చేపట్టే సీసీ రోడ్ల నిర్మాణం, వీధిలైట్ల ఏర్పాటు పనులకు ఆయన భూమి పూజ చేశారు. ప్రజాసంక్షేమానికి పార్టీలకు అతీతంగా పాటుపడతామని అన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, వీధి లైట్ల ఏర్పాటుకు హెచ్ఎండీఏ నిధులు తెచ్చి శంకుస్థాపన చేశామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పనులకు శ్రీకారం చుడతామని చెప్పారు.



ముడిమ్యాల్‌లో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, నాయకులు

పేదలు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. చేవెళ్ల నుంచి గ్రామాలకు ఉన్న అన్ని లింకు రోడ్లను బీటీగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ముడిమ్యాల్ ప్యాక్స్ ఛైర్మన్ గోనె ప్రతాప్‌రెడ్డి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు బెల్టులు, బూట్లు, టైలు అందించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ప్యాక్స్ ఛైర్మన్లు డి.వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, ఎంపీడీవో హిమబిందు, పీఆర్ డీఈ గణేశ్, ఏఈలు గీతాస్రవంతి, ప్రభాకర్, నాయకులు శైలజాఆగిరెడ్డి, డి.గోపాల్‌రెడ్డి, రాజశేఖర్, శశికల పాండుగౌడ్, శ్రీనివాస్, ప్రభాకర్, శ్రీనివాస్, రాంచంద్రయ్యగౌడ్, మధుసూదన్ గుప్తా, రాంరెడ్డి, రాములు, స్వరూప, పెంటయ్యగౌడ్, రాములు, గోనె సరితా ప్రతాప్‌రెడ్డి, వీరందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పాండుయాదవ్, లక్ష్మారెడ్డి, కార్తీక్‌రెడ్డి, కాలె శ్రీకాంత్, ఎం.కృష్ణారెడ్డి, బుర్ల సాయినాథ్, శ్రీనివాస్‌గౌడ్, నరేందర్‌గౌడ్, జి.శ్రీనివాస్‌రెడ్డి, వీరేశం, శేఖర్‌రెడ్డి, ఆయా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్కారం ప్యాక్స్ ఛైర్మన్‌గా ప్రభుసాగర్

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మల్కారం పీఎస్‌పీఎస్ నూతన ఛైర్మన్‌గా రామాంజపూర్‌నకు చెందిన ప్రభుసాగర్ ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సొసైటీ కార్యాలయంలో డైరెక్టర్లు ఆయనను ఎన్నుకున్నారు. అనంతరం బాధ్యతలు చేపట్టిన ప్రభుసాగర్ మాట్లాడుతూ... రైతుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు. అర్హులైన రైతులు పంట రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు లక్ష్మీకృష్ణారెడ్డి, రెడ్యా, వాజీద్‌ఖాన్, సెక్రటరీ సురేందర్, విక్రమ్ పాల్గొన్నారు.



ఛైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న ప్రభుసాగర్

నూతన ఛైర్మన్‌కు శుభాకాంక్షల వెల్లువ

మల్కారం ప్యాక్స్ నూతన ఛైర్మన్ ప్రభుసాగర్‌కు సుల్తాన్‌పల్లి మాజీ సర్పంచ్‌లు యాటకారి సిద్ధేశ్వర్, సత్తయ్య, జగన్‌మోహన్‌రెడ్డిలు శుభాకాంక్షలు తెలిపారు. రైతులకు మరిన్ని సేవలందించాలని ఆకాంక్షించారు. మాజీ ఎంపీటీలు, జడ్పీటీసీ, వివిధ పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రగతి పథంలో షాద్‌నగర్



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మునిసిపాలిటీని ప్రగతి పథంలో దూసుకుపోతోందని ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల ఛైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం 8వ వార్డులో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు.ఈడెన్ గార్డెన్ వద్ద యూజీడీ పనులను రెండు నెలల్లో చేయిస్తానని హామీ ఇచ్చారు. పట్టణ సౌకర్యం మేరకు సీసీ రోడ్లు, యూజీడీ పనులను పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ బాబర్‌ఖాన్, మున్సిపల్ కమిషనర్ సునీత, కాంగ్రెస్ నాయకులు అగ్గనూరి విశ్వం, మంచిరేవుల సాయికృష్ణ, చెంది తిరుపతిరెడ్డి, ఎన్టీ ఇబ్రహీం, అగ్గనూరి బస్వం, వర్ష, జయప్రకాశ్, మురళీమోహన్ పాల్గొన్నారు.

పలు చోట్ల ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



శంషాబాద్‌లో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



కొత్తూర్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

శంషాబాద్/కొత్తూర్/కందుకూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబరు 5న ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన టీచర్లను మంగళవారం ఆయా పాఠశాలలు, కార్యాయాల్లో సన్మానించారు. శంషాబాద్‌లోని మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చక్కటి విద్యాబుద్ధులు నేర్పే ప్రతీ ఉపాధ్యాయుడునని అన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యాబుద్ధులు నేర్పడం టీచర్లకు దేవుడిచ్చిన వరం అన్నారు. ఈ సందర్భంగా ఎంఈవోలు లక్ష్మణ్‌నాయక్, రాంరెడ్డి, ఎంపీడీవో మున్నీ ఉత్తమ ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ గజిటెడ్ హెచ్ఎంలు మధుకర్, కృష్ణారెడ్డి సంఘాల నాయకులు బాల్‌రెడ్డి, బాల్‌రాజ్, భాస్కర్, వీరమల్లేష్, నాను టీచర్లు పాల్గొన్నారు. జిల్లా, మండల ఉత్తమ ఉపాధ్యాయును కొత్తూరు ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఈవో అంగోర్ నాయక్, అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. అలాగే ప్రమోషన్‌పై వెళ్లిన వారిని సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ అరుంధతి, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, బీఆర్ఎస్ నాయకుడు బి.దేవేందర్‌యాదవ్, కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్, హెచ్ఎంలు వెంకట్రామ్‌రెడ్డి, చంద్రశేఖర్, రఘుపాల్‌రెడ్డి, స్వామి, ప్రియాంక, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రఘుపాల్, రాఘవేందర్, దామోదర్‌రెడ్డి, కృష్ణ, సామెల్, శ్రీనివాస్, టీచర్లు పాల్గొన్నారు. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని కందుకూరు ఎంపీడీవో సరిత అన్నారు. 49మంది ఉపాధ్యాయులను మండల పరిషత్‌లో ఎంఈవో నర్సింహ ఆధ్వర్యంలో సన్మానించారు. ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల మండల అధ్యక్షులు గోపాల్‌నాయక్, మహేందర్‌రెడ్డి, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రమేశ్, టీచర్లు పాల్గొన్నారు.



కందుకూరు: ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన ఎంపీడీవో, ఎంఈవో

రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తా



జయమ్మను సన్మానిస్తున్న సొసైటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు

మహేశ్వరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పంటలకు గిట్టుబాటు ధర, రైతులకు ఎరువులు విత్తనాలు సకాలంలో అందేలా కృషిచేస్తానని మహేశ్వరం పీఏసీఎస్ నూతన ఛైర్‌పర్సన్‌గా నియమితులైన చెన్రెడ్డి జయమ్మ అన్నారు. మంగళవారం మహేశ్వరంలోని ప్యాక్స్ కార్యాలయంలో ఆమె భాధ్యతలు చేపట్టారు. తనకు ఛైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు, రైతులకు కృతజ్ఞతలు చెబుతున్నానని అన్నారు. కార్యక్రమంలో మల్లేష్‌యాదవ్, సీహెచ్.యాదయ్య, మద్ది కరుణాకర్‌రెడ్డి, ఎ. ప్రశాంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, కూన యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ ఛైర్మన్‌ను కలిసిన వెంకట్‌రాంరెడ్డి

కందుకూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కందుకూరు సొసైటీ ఛైర్మన్‌గా బాధ్యత చేపట్టిన ఎస్. వెంకట్‌రాంరెడ్డి మంగళవారం డీసీసీబీ ఛైర్మన్ కొత్తకురుమ సత్తయ్యను కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసినట్లు వెంకట్‌రాంరెడ్డి తెలిపారు. సొసైటీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఆయనతో డైరెక్టర్ పాండురంగారెడ్డి, ఇ.రాంచంద్రారెడ్డి ఉన్నారు.



సత్తయ్యను సన్మానించిన వెంకట్‌రాంరెడ్డి

రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీలకు

నవజీవన్ విద్యార్థినుల ఎంపిక



బహుమతి అందుకుంటున్న విద్యార్థినులు

షాబాద్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిర్వహించే కళా ఉత్సవ్ రాష్ట్ర స్థాయి పోటీలకు షాబాద్‌లోని నవజీవన్ హైస్కూల్ విద్యార్థినులు మేఘన, మెహక్, దివ్యశ్రీ, ఎస్తేర్ ఎంపికయ్యారు. తుక్కుగూడలో మంగళవారం జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. బృందగానం, నృత్యప్రదర్శన విభాగాల్లో ప్రతిభ చూపిన ఈ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని స్కూల్ కరస్పాండెంట్ పాపిరెడ్డి తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందించారు.

జనాభా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలి



నియామకపత్రాన్ని అందజేస్తున్న బర్క కృష్ణ

షాబాద్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): జనాభా నిష్పత్తి ప్రకారం ఆయా వర్గాలకు రిజర్వేషన్లు కేటాయించాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. మక్తగూడలో గ్రామ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ... బీసీలు సంఘటితం కావాలన్నారు. కార్యక్రమంలో బీసీ సేన మండలాధ్యక్షుడు దయాకర్‌చారి, ఉపాధ్యక్షుడు బాల్‌రాజ్, యువజన విభాగం మండల అధ్యక్షుడు అజయ్‌కుమార్, కార్యదర్శి శివకుమార్, ఆనంద్, తిరుపతి, రాజేందర్‌గౌడ్, యాదగిరి, చంద్రశేఖర్‌చారి, మాధవచారి, మహేందర్, లింగం, ప్రసాద్, మల్లేష్, సత్యనారాయణచారి, భూషన్‌చారి, శ్రీశైలం పాల్గొన్నారు. మక్తగూడ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా శంకర్, ఉపాధ్యక్షుడు అంజయ్య, కోశాధికారి నర్సింహులు, ప్రచార కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

మెగా వైద్య శిబిరం విజయవంతం

తలకొండపల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాంపూర్‌లో ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. లయన్ కొత్త శంకరయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబీకుల సహకారంతో శిబిరాన్ని క్లబ్ జిల్లా గవర్నర్ మహేంద్ర కుమార్‌రెడ్డి ప్రారంభించారు. 700 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి రూ. 75వేల విలువైన మందులు అందజేశారు. దృష్టిలోపం ఉన్న వారికి ఆపరేషన్ల కోసం ఎనుగొండ రాంరెడ్డి కంటి ఆస్పత్రికి తరలించారు.

బారులు.. బాధలు!



షాద్‌నగర్ ప్యాక్స్ వద్ద యూరియా కోసం పోటీపడుతున్న రైతులు

(ఐదో పేజీ తరువాయి)

సాగు విస్తీర్ణం 1,77,735 ఎకరాలు ఉండగా ఈ ఏడాది 1,29,088 ఎకరాలకు పరిమితం చేశారు. అంటే దాదాపు 48 వేల ఎకరాల్లో పత్తి సాగు విస్తీర్ణం తగ్గింది. పత్తితో పాటు మొక్కజొన్న, కంది, జొన్న, వేరుశనగ ఇతర పంటల సాగు కూడా తగ్గింది.

సగం కూడా రాలే..

ఈసారి సాగుకు అవసరమైన యూరియాలో సంగం కూడా జిల్లాకు రాకపోవడంతో రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాకు 72,200 టన్నుల ఎరువు బస్తాలు అవసరం ఉండగా 23,563 టన్నులే సరఫరా చేశారు. ఆమనగల్లు డివిజన్‌లో 6,094 టన్నులు పంపిణీ చేయగా చేవెళ్ల డివిజన్‌లో 4,672 టన్నులు పంపిణీ చేశారు. ఇబ్రహీంపట్నం డివిజన్‌లో 1,928 టన్నులు, మహేశ్వరం డివిజన్‌లో 1,866 టన్నుల యూరియాను పంపిణీ చేశారు. డీలర్లు, సొసైటీలు, మార్క్‌ఫెడ్ ద్వారా 268 టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

అవసరం మేరకు యూరియా ఉంది

ఇబ్రహీంపట్నం: రైతుల అవసరం మేరకు యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయాధికారి ఉష అన్నారు. మంగళవారం పొల్కంపల్లి పీఏసీఎస్‌లో యూరియా నిల్వలను పరిశీలించారు. జొన్న, మొక్కజొన్న పంటల వివరాలను ఏఈవోల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఏవో విద్యాధరి, ఏఈవో సృజన ఉన్నారు.



పొల్కంపల్లి పీఏసీఎస్‌లో యూరియా నిల్వలను పరిశీలిస్తున్న డీఏవో ఉష

అట్టహాసంగా టీఎల్ఎం మేళా

ఆమనగల్లు, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులోని జెడ్పీ బాలుర పాఠశాల ఆవరణలో మంగళవారం బోధనోపకరణాల మేళా నిర్వహించారు. టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, ఎంపీడీవో కుసుమ మాధురి, సంఘ సేవకుడు పాపిశెట్టి రాములతో కలిసి ఎంఈవో పాండు టీఎల్ఎమ్ మేళాను ప్రారంభించారు. మండల పరిధి 29 పాఠశాలల ఉపాధ్యాయులు రూపొందించిన 200 బోధనోపకరణాలను మేళాలో ప్రదర్శించారు. విద్యార్థులు నిర్వహించిన నృత్య, నాటక, సామాజిక అవగాహన ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. విద్యార్థుల్లో అభ్యసన సామార్థ్యాల పెంపునకు మేళాలు దోహదపడతాయని ముఖ్య అతిథులు అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రామలక్ష్మి, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రదర్శనలను తిలకిస్తున్న మున్సిపల్ కమిషనర్ శంకర్, ఎంపీడీవో మాధురి, పాపిశెట్టి రాము

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని ఉన్నత పాఠశాలలో టీఎంఎల్ మేళా నిర్వహించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల తెలుగు, ఇంగ్లిష్, మాథ్స్, ఈవీఎస్ అంశాల్లో 152 ప్రదర్శనలు వచ్చాయి. సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామని ఎంఈవో హీర్యా నాయక్ తెలిపారు. మండల నోడల్ అధికారి శ్రీనివాస్, హెచ్ఎం వెంకట్‌రెడి పాల్గొన్నారు.



ప్రదర్శనలు తిలకిస్తున్న ఉపాధ్యాయులు



దీక్షలో నినాదాలు చేస్తున్న మండల సాధన జేఏసీ నాయకులు

గట్టిప్పలపల్లిని మండలం చేయాల్సిందే

తలకొండపల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. గట్టిప్పలపల్లిని మండలం చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 313వ రోజుకు చేరాయి. 11పంచాయతీలతో మండలం చేయాలని మాజీ సర్పంచ్ జయమ్మ వెంకటయ్య, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, జేఏసీ ఛైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ ఛైర్మన్ శరత్‌చంద్ర, ఆంజనేయులుగౌడ్, కార్యదర్శి అనిల్ కోరారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలన్నారు. లేదంటే ఎంతటి పోరాటానికైనా సిద్ధమని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. దీక్షల్లో గ్రామస్థులు పాల్గొంటున్నారు.

న్యాయం జరిగే వరకు పోరాటం

కడ్తాల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని కడ్తాల మండల హైటెన్షన్ విద్యుత్ లైన్ భూ నిర్వాసితులు అన్నారు. కడ్తాలలో బీదర్-మహేశ్వరం 765కేవీ లైన్ అలైన్మెంట్ మార్చాలని చేపట్టిన రిలే దీక్షలు మంగళవారానికి తొమ్మిదో రోజుకు చేరాయి. దీక్షలో గాంధీ, రాజేందర్, రాజేశ్, మహేశ్‌లు కూర్చున్నారు. వారికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్, ఎమ్మార్పీఎస్ నాయకుడు రమేశ్, బీఆర్ఎస్ నాయకుడు రామకృష్ణ, పాత్రికేయుడు మల్లేశ్‌గౌడ్ సంఘీభావం తెలిపారు. సాగు భూముల్లో విద్యుత్ లైన్ వేస్తే రైతులు ఉపాధి కోల్పోతారని అన్నారు.



కడ్తాలలో దీక్షలో పాల్గొన్న భూ నిర్వాసితులు

క్రైం కార్నర్

ఇసుక తరలింపు వాహనాల సీజ్

మాడ్గుల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్కపల్లి సమీపాన డిండి కాల్వ వద్ద ఇసుక డంపుల నుంచి లారీల్లో అక్రమంగా ఇసుకను హైదరాబాద్‌కు తరలిస్తుండగా మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ఓ టిప్పర్, రెండు లారీలు, ఓ జేసీబీని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించామని సీఐ వేణుగోపాల్ తెలిపారు. ఇందుకు బాధ్యులైన 8మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన వివరించారు.



పట్టుబడిన ఇసుక లారీలు

ఇద్దరిపై పోక్సో కేసుల నమోదు

షాబాద్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రెండు పోక్సో యాక్ట్ కేసులు నమోదయ్యాయి. ఓ పాఠశాల విద్యార్థినిని ఆమె బంధువు వేధింపులకు గురి చేశాడు. మరో ఘటనలో విద్యార్థిని బస్సు ఎక్కే క్రమంలో ఓ యువకుడు వేధించాడు. రెండు కేసుల్లో బాలికల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని పోలీసులు వివరించారు.

బాలుడి అదృశ్యం.. ఆచూకీ లభ్యం

కేశంపేట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): హాస్టల్‌కని ఇంట్లో నుంచి వెళ్లిన బాలుడు అదృశ్యమవగా తండ్రి ఫిర్యాదుతో పోలీసులు వెతికి పట్టుకున్నారు. ఈ సంఘటన కంకరాళ్ల తండాలో చోటు చేసుకుంది. సీఐ నరహరి తెలిపిన వివరాల మేరకు.. పాత్లవత్ రవి పెద్ద కొడుకు అరుణ్ (13) కొత్తపేట హాస్టల్‌లో ఉంటూ జెడ్పీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. 15న ఉదయం ఇంటి నుంచి అరుణ్ హాస్టల్‌కు వెళ్తున్నట్టు చెప్పి ఎటో వెళ్లిపోయాడు. కొడుకు ఆచూకీ తెలియక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు బాలుడి కోసం గాలించారు. లుక్ ఔట్‌లో భాగంగా రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. మంగళవారం రాత్రి గద్వాల రైల్వేస్టేషన్‌లో అరుణ్‌ను పోలీసులు గుర్తించి ఆధీనంలోకి తీసుకున్నారు. బాలుడు షాద్‌నగర్‌లో రైలెక్కి వచ్చినట్టు తెలిపారు. కాగా అరుణ్‌ను బుధవారం ఇంటికి తీసుకొస్తామని సీఐ వివరించారు.

వీడిన గ్రహణం

(ఐదో పేజీ తరువాయి)

2022 మే 11న రూ.75లక్షల అంచనాతో ఆసుపత్రి నిర్మాణానికి అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు భూమి పూజ చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ భవన నిర్మాణాన్ని స్లాబ్ వరకు పూర్తి చేశాడు. పూర్తి స్థాయిలో నిధులు మంజూరు కాకపోవడంతో పనులను అర్థంతరంగా నిలిపివేశాడు. నిధులు లేమితో ఆగిపోయిన పనుల విషయాన్ని ఎమ్మెల్యే తెలుసుకున్నారు. ఆస్పత్రి నిర్మాణాకి ఎన్ని నిధులు అవసరమో అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన సూచనతో అధికారులు రూ. 22.80లక్షలు ఖర్చు అవుతాయని నివేదిక అందించడంతో అంతే మొత్తం మంజూరు చేయించారు. హాస్పిటల్ భవన నిర్మాణం పూర్తయితే ప్రజలకు మరింతగా వైద్య సేవలు అందనున్నాయి.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తయితే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందుతాయి. మూడేళ్లుగా భవన నిర్మాణం పనులు పెండింగ్‌లో ఉంటే ఎవరూ పట్టించుకోలేదు. మంజూరైన నిధులతో పనులను త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలి.

- భాస్కర్ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్, నిర్దవెల్లి

సంక్షిప్తంగా...

● **యాచారం:** తెలంగాణ రైతాంగ పోరాట అమరుల ఆశయ సాధనకు యువత కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ కోరారు. మంగళవారం మంతన్‌గౌరెల్లిలో సాయుధ పోరాట వారోత్సవాలను ప్రారంభించారు. యోధుల స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాలన్నారు. బొడ్డులాల్ నాయక్, దొడ్డి కొమరయ్య తమ ప్రాణాలను వదిలారని పేర్కొన్నారు. జమీందారులు, నిజాంపాలనకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేసిన వారి స్ఫూర్తితో హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలన్నారు.

● **కేశంపేట:** ఆశా వర్కర్ల మండల నూతన కమిటీని, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమావేశమైన ఆశాలతో మాట్లాడి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలి గా పద్మ, కార్యదర్శి సుజాత, ఉపాధ్యక్షురాలు వసంత, సునీత, సహ కార్యదర్శులు లక్ష్మి, సుజాత, కోశాధికారి సుజాతలను ఎన్నుకున్నారు.

● **ఆమనగల్లు:** రైతులు సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేయించుకోవాలని ఏవో శ్రీనివాస్‌గౌడ్ కోరారు. మేడిగడ్డలో పంటల నమోదు, చీడపీడల నివారణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవోల వద్ద వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఇలా చేస్తే అమ్మకాల సమయంలో ఇబ్బందులు ఉండవని చెప్పారు. ఏఈవో గాయత్రి ఉన్నారు.

● **చేవెళ్ల:** విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంపీడీవో హిమబిందు తెలిపారు. రావులపల్లి పాఠశాలను తనిఖీచేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ఆమె వడ్డించి భోజనం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల భోజనంలో మెనూ పాటించాలన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నతులుగా ఎదగాలని పేర్కొన్నారు. టీచర్లు, విద్యార్థులు ఉన్నారు.

● **ఇబ్రహీంపట్నం:** ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు ముత్యాల భాస్కర్ డిమాండ్ చేశారు. బీజేవైఎం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం చౌరస్తాలో నిరసన దీక్ష చేశారు. భాస్కర్ మాట్లాడుతూ నాలుగేళ్లుగా రాష్ట్రంలో ప్రభుత్వాలు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయక కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అదే విధంగా ఉందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు నాయిని సత్యనారాయణ, జక్క రవీందర్‌రెడ్డి, రాఘవేందర్, శ్రీనివాస్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

● **షాద్‌నగర్ రూరల్:** ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. వాసవి, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో దాత రూపాదేవి శ్రీనివాసులు సహకారంతో వంద మంది విద్యార్థలకు వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు కల్వ మాణిక్యం, కార్యదర్శి నవీన్ కుమార్, వనితా క్లబ్ అధ్యక్షురాలు మధుప్రియ, జోన్ ఛైర్మన్ వెంకటరమణ, రమాదేవి, స్వప్న, రూపాదేవి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● **కందుకూరు:** కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజల గోసలు పట్టించుకునే నాథుడు లేడని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు సురేందర్‌రెడ్డి, జి.లక్ష్మీనర్సింహారెడ్డి, దశరథ్ అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మన్నె జయేందర్ అధ్యక్షతన ధన్నారం, చిప్పలపల్లి, మురళీనగర్ గ్రామ కార్యకర్తల సమావేశాలల్లో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు.

● **మహేశ్వరం:** నేటి విద్యార్థులే రేపటి పౌరులని, అందుకే వారు ఎలాంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని వైఆర్‌జీ కేర్ స్వచ్ఛంద సంస్థ లింక్ వర్కర్ స్కీం ప్రాజెక్టు జిల్లా కో-ఆర్డినేటర్ టి.రామిరెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి జాగ్రత్తలు పాటించాలన్నారు. యువత చదువుపై దృష్టి సారించి వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ కవిత అధ్యాపకులు పాల్గొన్నారు.